క్లుప్తంగా

కొప్పర్తి సర్పంచ్‌గా చెక్ పవర్ అందుకున్న సుజాతమ్మ

చింతకొమ్మదిన్నె : సీకేదిన్నె మండలంలోని కొప్పర్తి పంచాయతీకి చెందిన సర్పంచ్ విషయంలో ఇటీవల కోకటం సుజాతమ్మ స్థానంలో కోకటం లక్ష్మీనారాయణరెడ్డిని నియమిస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందులో భాగంగా కోకటం సుజాతమ్మ హైకోర్టుకు వెళ్లి చెక్ పవర్‌ను తనకు వచ్చే విధంగా హైకోర్టులో అప్పీలు చేసింది. వాదోపవాదాలు జరిగిన అనంతరం చెక్ పవర్‌లను సుజాతమ్మకు ఇస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు డీపీఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

చంబా వైరస్‌ను పసుపునీటితో కడిగేశారు



పులివెందులలో నాలుగు రోడ్ల కూడలిని పసుపు నీటితో శుద్ధి చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పులివెందుల ప్రాంతంలో పర్యటించి అబద్ధాలు, అసత్య ప్రచారాలు చేసి పులివెందుల ప్రాంతాన్ని అపవిత్రం చేశారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్పలు తెలిపారు. గురువారం స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వారు చంద్రబాబునాయుడు(చంబా వైరస్) పులివెందులలో పర్యటించిన ప్రాంతాలను, ప్రసంగం చేసిన ప్రాంగణాన్ని పసుపు, పేడ నీటితో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ఒక వైరస్ లాంటి వాడని, ఆ వైరస్ ఎక్కడ సోకితే అక్కడ భస్మమేనన్నారు. ఏ ప్రాంతంలో అడుగుపెట్టినా ఆ ప్రాంతం ఇబ్బందుల పాలవుతుందన్నారు. చంద్రబాబు తన ప్రసంగంలో ఎక్కడ చూసినా తన నోటి వెంట అబద్ధాలు తప్ప నిజాలు రావు అన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, రాజశేఖర్, నాయకులు రసూల్, సోపాల వీరా, సూరి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



ఆర్టీపీపీలో దీక్షలో పాల్గన్న జేపీసీ నాయకులు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని ఉద్యోగులు, కార్మికులు తమ డిమాండ్ల కోసం చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం కూడా కొనసాగాయి. కార్యక్రమంలో ఆర్టీపీపీ సీఈ నాగరాజు పాల్గొని ప్రసంగించారు.

బాబు.. మీ పార్టీ సభ్యులకే బీమా మంజూరు

తొండూరు : టీడీపీ అధినేత చంద్రబాబుకు వారి పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులకే పంటల బీమా మంజూరైంది కళ్లకు కనిపించదా అని వైఎస్సార్‌సీపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రజినికాంత్‌రెడ్డిలు ధ్వజమెత్తారు. గురువారం తొండూరులో వారు మాట్లాడుతూ రాంగోపాల్‌రెడ్డి తల్లి లక్ష్మీదేవమ్మకు సింహాద్రిపురం మండలం మద్దలపాయ గ్రామ రెవెన్యూ పరిధిలోని 10.63 ఎకరాల చీనీ తోటకు రూ.2,02,048 లు, అలాగే రాంగోపాల్‌రెడ్డి సతీమణి ఉమాదేవికి 5.80ఎకరాల కంది పంటకు రూ.4,732లు, అతని కుమారుడు సాయిరెడ్డికి 1.97 ఎకరాల పత్తి పంటకు రూ.17,499లు పంటల బీమా మంజూరైందని.. టీడీపీ అధినేత చంద్రబాబు, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిల కళ్లకు కనపడలేదా అంటూ ఎద్దేవా చేశారు. పులివెందులలో జరిగిన సభలో రైతులకు పంటల బీమా మంజూరు కాలేదని బీటెక్ రవి ఇప్పుడే చెప్పారంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు ఇది నిదర్శనం కాదా అని వారు తప్పుబట్టారు. ఇలాంటి నీచమైన, పనికి మాలిన రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుపట్టించేందుకు ప్రసంగాలు చేస్తున్నారని వారు విమర్శించారు.

చంద్రబాబు కాలువలకు చుక్కనీరు ఇవ్వలేదు

లింగాల : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వ్యవసాయం దండగ అంటూ ఆనాడు కాలువలకు చుక్కనీరు ఇవ్వలేదని వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ సొరెడ్డి చంద్రశేఖరరెడ్డి అన్నారు.

గురువారం లింగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని తాతిరెడ్డిపల్లె, ఎగువపల్లె, కోమన్నూతల, మురారిచింతల గ్రామాలకు ప్రత్యేక ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి కుంటలకు, చెరువులకు నీరు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలదేనని రైతన్నలు కొనియాడుతున్నారన్నారు. ఇటీవల పాడా నిధులతో సుమారు రూ.5 కోట్లు వెచ్చించి లింగాల మండల కేంద్రంలో రెండు ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం, ఎంపీలదేనన్నారు. ప్రస్తుతం ఆ చెరువులలో కృష్ణా జలాలు గలగలా ప్రవహిస్తుంటే అది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందన్నారు.

సచివాలయాలు సంక్షేమ నిలయాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు పల్లా లక్ష్మయ్య, వెల్దుర్తి గ్రామం, వీరపునాయునిపల్లె మండలం. మగ్గం నేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మగ్గంలో వచ్చే ఆదాయం సరిపోక కూలి పనులకు వెళ్లేవాడు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నేతన్న నేస్తం పథకం ద్వారా సాయం అందడంతో తమ జీవనం ఇబ్బందిలేకుండా సాగుతోందన్నాడు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఎటువంటి సహాయం చేయలేదన్నాడు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె పఠాన్ దస్తగిరిబి, నేలతిమ్మాయపల్లె, వీరపునాయునిపల్లె మండలం. ఎస్.పాలగిరి సచివాలయం పరిధిలోకి వచ్చే ఈమెకు ఒక్క కొడుకు ఉన్నాడు. భర్త, ఆమె కలసి కూలీపనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అందిస్తున్న పింఛన్‌తో సంతోషంగా జీవనం సాగిస్తున్నామంటోంది. సచివాలయాలు రావటంతో ఏ అవసరం వచ్చినా గతంలో లాగా ఎక్కడికి వెళ్లాల్సిన పనిలేకుండా పోయింది.



వీరపునాయునిపల్లె మండలం వెల్దుర్తి గ్రామ సచివాలయం

వీరపునాయునిపల్లె మండలంలో సచివాలయాల సంఖ్య	15
వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల సంఖ్య	2,220
వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా లబ్ధి	రూ.16.46 కోట్లు
వైఎస్సార్ పింఛన్ లబ్ధిదారుల సంఖ్య	8,500
వైఎస్సార్ పింఛన్ కానుక పథకం ద్వారా పొందిన లబ్ధి	రూ.43.20 కోట్లు
జగనన్న అమ్మఒడి పథకం లబ్ధిదారుల సంఖ్య	5,020
జగనన్న అమ్మఒడి పథకం ద్వారా పొందిన లబ్ధి	రూ.16.35 కోట్లు

వీరపునాయునిపల్లె : పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించాలన్న సంకల్పంతో ప్రజల ఇంటివద్దకే పాలనను తెచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం అలా కాకుండా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వారి అవసరాలను అడిగి తెలుకోవటంతో పాటు అర్హత ఉన్న వారి ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు వస్తున్నాయి. గతంలో రూ.200 పింఛన్ కోసం వృద్ధులు, వికలాంగులు పంచాయతీ కార్యాలయాల వద్ద పడికాపులు కాసేవారు. ప్రస్తుతం పింఛన్‌దారులు నిద్ర లేవకముందే తలుపు తట్టి రూ.2,750 పింఛన్ అందజేస్తున్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో ఇటువంటి వ్యవస్థ లేదు. ఆంధ్ర రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పాలనపై దేశంలోని అన్ని రాష్ట్రాలు దృష్టి సారిస్తున్నాయి.

రోడ్డుపై మురుగునీరు పారకుండా చూసుకోవాలి

పులివెందుల టౌన్ : పట్టణంలోని రోడ్లపై మురుగునీరు పారకుండా చూసుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పారిశుధ్య సిబ్బందికి సూచించారు. గురువారం పట్టణంలోని భాకరాపురం, శ్రీనివాస హాలు వెనుక గల వీధులలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీనివాస హాలు వెనుక జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ శుభ్రం చేయు పనులను పరిశీలించారు. మ్యాన్‌హోల్స్ మూతలు పాడయ్యాయని ఫిర్యాదు అందిన వెంటనే పాడైపోయిన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



మ్యాన్‌హోల్ మరమ్మతుల పనులను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి) లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్ రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ద ములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుటకు చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

వల్లూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కమలాపురంలోని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ మరియు పీజీ కళాశాలలో శుక్రవారం జరిగే జాబ్ మేళాను నియోకవర్గంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి పిలుపునిచ్చారు. కడపలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ జాబ్ మేళాలో కియా మోటార్స్ ఇండియా, అపోలో ఫార్మసీ, అమర్ రాజా బ్యాటరీస్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, సెంచరీ ఫ్లెవుడ్స్ ఏఐఎల్ డిక్సన్, ఫ్లిప్ కార్ట్, ట్రయో విజన్ కాంపోజిట్ టెక్నాలజీస్ వంటి 13 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లు, బయోడేటా, ఆధార్, పాస్ పోర్ట్ సైజు ఫొటోతో హాజరు కావాలని తెలిపారు. ఆయా కంపెనీల ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగే ఇంటర్వ్యూ ప్రాతిపదికన ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరుగుతుందని, ఎంపికైన వారికి ఆకర్షణీయమైన జీతం ఉంటుందన్నారు. నియోజకవర్గ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శాంతి ర్యాలీ

జమ్మలమడుగు : పట్టణంలో మణిపూర్ సంఘటలను నిరసిస్తూ గురువారం ప్రజా సంఘాల నాయకులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి పాత బస్టాండ్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. బిషప్ సంతోష్‌కుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, సీపీఐ సుబ్బారెడ్డి, శివనారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత

వేంపల్లె : మండలంలోని పాములూరు గ్రామంలో ఉండే సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ధర్మారెడ్డి తిరుపతికి వెళ్లి ఆసుపత్రిలో ఉన్న నలుగురికి పింఛన్ అందజేశారు. ఇటీవల కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆ గ్రామం పర్యటనలో భాగంగా ఆ గ్రామంలో ఉన్న దేవిరెడ్డి పాలేటమ్మ, పాములూరు లక్ష్మీదేవి, మల్లేల నడిపి గంగన్న, మల్లెల సుబ్బలక్షుమ్మలు మోకాళ్ల ఆపరేషన్లు చేయించాలని కోరారు. అందుకు స్పందించిన ఎంపీ సొంత నిధులతో తమ వ్యక్తిగత సిబ్బందితో తిరుపతి బర్డ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించారు. వారందరికి పింఛన్ అందించేందుకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ధర్మారెడ్డి తిరుపతికి వెళ్లే వారికి పింఛన్ డబ్బులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అలాగే కడపలో పుష్పగిరి ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ చేయించుకున్న ముతుకూరు ప్రభావతమ్మకు ఆసుపత్రికి వెళ్లి పింఛన్‌ను అందజేశారు.



తిరుపతికి వెళ్లి పింఛన్ డబ్బులు అందిస్తున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ధర్మారెడ్డి

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

చెన్నూరు : మండలంలోని పాడి రైతులు పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ జేడీ శారదమ్మ తెలిపారు. గురువారం కొండపేట గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ అలాగే డీఎల్‌డీఏ కడప వారి సంయుక్త పర్యవేక్షణలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ పాల్గొని మాట్లాడారు. పాడి రైతులు పశు పోషణపై అవగాహన పెంపొందించుకోవాలని, దీని ద్వారా లేగ దూడలను సంరక్షించు కున్నట్లవుతుందన్నారు. అంతేకాకుండా ఏదైనా ప్రమాదం సంభవించినట్లయితే రెండు నెలలలోపే నష్టపరిహారం పొందవచ్చన్నారు. వాతావరణ వల్ల వచ్చే వ్యాధులను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు పశువులకు టీకాలు వేయించాలన్నారు. అలాగే రాయితీ ద్వారా పశు దాణ కిలో ఆరు రూపాయల 50 పైసలకు చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని పది రోజుల నుండి ఏడు నెలల వయసున్న లేగ దూడలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో సుమారు 46 మంది రైతులు పాల్గొనడం జరిగింది, ప్రదర్శనలో విజేతలైన పాడి రైతులకు మొదటి బహుమతిగా స్టీల్ బకెట్, ద్వితీయ తృతీయ బహుమతులుగా పాల క్యాన్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ తుంగ చంద్రశేఖర్‌యాదవ్, ఎంపీటీసీ నాగిరెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు, డీఎల్‌డీఏ సంస్థ చైర్మన్ మాధవరెడ్డి, వెంకటరమణయ్య, రమేష్, ఏడీ మునయ్య, పశు వైద్యులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ

విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి

కమలాపురం : వరి పంట సాగు చేసే రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం టి.చదిపిరాళ్ల గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె రైతులకు వరి పంట సాగులో తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. వరిలో విత్తన శుద్ధి చేయడం ద్వారా మొదటి నెల రోజుల పాటు ఎలాంటి తెగుళ్లు ఆశించ కుండా కాపాడుకోవచ్చన్నారు. విత్తన శుద్ధికి 6 నుంచి 10 గ్రాముల సుడోమోనస్ కిలో విత్తనానికి కలిపి వాడుకోవాలన్నారు. దీని ద్వారా అగ్గి తెగులు, ఆకుమచ్చ తెగుళ్లను నివారించవచ్చన్నారు. వరి పంటలో మొలక శాతం కట్టే విధానాన్ని ఆర్‌బీకే, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో ఉచితంగా తెలుసుకోవచ్చన్నారు. వరిలో జీపీపీ పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. పురుగు మందులు, తెగుళ్ల మందులు వాడకం తగ్గించి మిత్ర పురుగులను రక్షించాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు వెంకట కృష్ణ, మమత, రైతులు పాల్గొన్నారు.



రైతులకు విత్తన శుద్ధి గురించి వివరిస్తున్న ఏఓ సరస్వతి

జెడ్పీటీసీకి ఘన సత్కారం



జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వేంపల్లె : మండల జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డిని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల బృందం ఘనంగా సత్కరించారు. గురువారం స్థానిక శ్రీసాయి రజిత గ్యాస్ ఏజెన్సీలో డిగ్రీ కళాశాల అధ్యాపకుల బృందం ఆధ్వర్యంలో శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల కళాశాలలో ఆడిటోరియం ఏర్పాటుకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. అందుకు స్పందించిన ఎంపీ వెంటనే ఆడిటోరియం నిర్మాణం కోసం ప్రభుత్వం ద్వారా రూ.10 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు.అలాగే కళాశాల నూతన భవనాల నిరార్మణానికి సుమారు రూ.22కోట్లు మంజూరయ్యాయని.. వాటి నిర్మాణ పనులు కూడా త్వరితగతిన పూర్తవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ సీఎస్ నాగేంద్ర, పీఆర్‌ఓ డాక్టర్ సి.బాలానారాయణ, అధ్యాపకులు మాధవరావు, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల గడప.. ఆంధ్రప్రదేశ్

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సంక్షేమ పథకాల గడప ఆంధ్రప్రదేశ్ అని, ప్రపంచంలో ఎక్కడాలేనన్ని పథకాలు రాష్ట్రంలో అమలు అవుతున్నాయని అది కేవలం జగనన్న సీఎం కావడంతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం కమలాపురం మునిసిపాలిటీ పరిధిలోని 7, 8, 9,10వ వార్డుల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి హాజరయ్యారు. కౌన్సిలర్లు మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, అల్లె రాజారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, గెంటిం సుగంధిలు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించారు. ఇంకా పథకాలు రానివారు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు సూచించారు. అవ్వా తాతలకు వారి మనవడు జగనన్న ఇస్తున్న పింఛన్ రూ.2750 దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వడం లేదన్నారు. పుట్టిన బిడ్డ మొదలుకుని పండుటాకుల వరకు అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం జగనన్న అన్నారు. అనంతరం నవ్యాంధ్ర మాల మహానాడు రాష్ట్ర, జిల్లా నాయకులు శరత్‌బాబు, సుధీర్‌లు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, రఘునాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, సురేష్‌బాబు, నరసింహులు, సావిత్రమ్మ, ఆర్‌వీఎస్ఆర్, గంగాధర్‌రెడ్డి, కొండారెడ్డి, మోహన్‌రెడ్డి, గఫార్, ఇర్ఫాన్, నిఖిల్‌రెడ్డి, దేవదానం, షావలి, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయంగా పాలన సాగుతోందని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని కదిరివారిపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలసుకుని వాటని అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సంక్షేమ పథకాలు రానివారు ఉంటే తెలియజేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగులో బుధవారం జరిగిన చంద్రబాబునాయుడి పర్యటనలో ప్రజల నుంచి ఎటువంటి స్పందనలేదన్నారు. మొరగుడి మూడురోడ్ల కూడలిలో పర్యటించిన ఆయన అక్కడున్న చేనేత నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కుండా రామయ్య విగ్రహానికి కనీసం పూల మాలకూడా వేయకుండా వెళ్లడం చూస్తుంటే చేనేతలమీద ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ, మండలస్థాయి అధికారులు, పార్టీ నాయకులు తులసీనాథ్‌రెడ్డి, వాసుదేవారెడ్డి, చంద్రారెడ్డి, నీలకంఠరెడ్డి, వాయినందన్‌రెడ్డి బలరామిరెడ్డి, నీలానందరెడ్డి, వినోధకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

బీసీ, చేనేతలద్రోహి చంద్రబాబు నాయుడు

– హస్త కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ విజయలక్ష్మీ

జమ్మలమడుగు : బీసీ, చేనేతల ద్రోహి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అని హస్త కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ విజయలక్ష్మీ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళిలు తెలిపారు. గురువారం జమ్మలమడుగులోని మోరగుడి మూడు రోడ్ల వద్ద ఉన్న చేనేత నాయకులు ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ఎమ్మెల్యేగా ఉన్న కుండా రామయ్య విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బుధవారం జమ్మలమడుగులో నిర్వహించిన ర్యాలీని కుండా రామయ్య విగ్రహం వద్దనుంచే ప్రారంభించాడు. అయితే అక్కడ బీసీలకు చెందిన నాయకుడు కుండా రామయ్య విగ్రహం ఒకటుందన్న విషయాన్ని గమనించకపోవడం, కనీసం స్థానిక టీడీపీ నాయకులు కూడా బాబు దృష్టికి తీసుకురాకపోవడం చూస్తుంటే అక్కడి టీడీపీ నాయకులకు గానీ, బీసీలను ఉద్దరిస్తానంటు బూటకపు హామీలు ఇస్తున్న చంద్రబాబునాయుడుకు గానీ బీసీలమీద ఎంతప్రేమ ఉందో తెలుస్తోందన్నారు. కుండా రామయ్య విగ్రహానికి కనీసం పూలమాల వేయకుండానే అక్కడనుంచి ర్యాలీ నిర్వహించడం చేనేత వర్గాలను అవమానించడమే అన్నారు. ర్యాలీలో కనీసం ప్రజలనుంచి స్పందన కూడా లేకపోయిందని దీనిని బట్టి చూస్తే నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి ఏమిటో అర్థం అవుతుందన్నారు. 14 సంవత్సరాలుగా పాలనలో ఉన్న బాబు బీసీలకు ఏంచేశారో చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీలకు పెద్దపీట వేసి వారిని ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా చేసిన ఘనత కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు.



కుండా రామయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ విజయలక్ష్మీ

నగరవనం, గరండాల్ రివర్ నిర్వహణ బాగుండాలి

– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల : పట్టణంలోని నగరవనం, గరండాల్ రివర్ నిర్వహణ బాగుండాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక పాడా కార్యాలయంలోని కాన్ఫరెన్స్ సమావేశ గదిలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి సమక్షంలో మున్సిపల్, అటవీ శాక అధికారులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. వాహనాల పార్కింగ్, డ్యూల్ టికెట్ విధానం, వైల్డ్ అనిమల్స్ బొమ్మలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే నగరవనం, గరండాల్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు ఓ ఏజెన్సీకి అప్పగించాలన్నారు. గరండాల్‌కు వచ్చే సందర్శకులు ఫొటోషూట్ కోసం, డ్రస్ చేంజ్ చేసుకునేందుకు రూమ్స్ వసతి కల్పించాలని నిర్ణయించారు. అలాగే రోజు మోటార్ బోటును నడిపించేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నగరవనం నుంచి గరండాల్ రివర్‌లోకి వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలన్నారు. నగరవనం, గరండాల్ నిర్వహణ సందర్శకులను ఆకట్టుకునేలా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఆర్డీఓ వెంకటేశులు, ఏఓ ప్రభాకర్‌రెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డి, ఏడీ శ్రీకాంత్‌రెడ్డి, ఫారెస్ట్ అధికారులు, మోడల్ టౌన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

హౌసింగ్ కాలనీలను త్వరగా పూర్తి చేయాలి

పులివెందుల నియోజకవర్గంలోని అన్ని మండలా ల్లోని హౌసింగ్ కాలనీలు త్వరితగతిన పూర్తి చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పాడా కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా హౌసింగ్ కాలనీలు పూర్తి చేసి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇంకా పనులు ప్రారంభించని కాలనీల్లో వెంటనే లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. వీటిపై ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు కలిసికట్టుగా పనిచేసి కాలనీలు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ వెంకటేశులు, పాడా ఏఓ ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీఈ రమణారెడ్డి, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, ఏఈలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పౌష్టికాహార కిట్లు పంపిణీ

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పౌష్టికాహార కిట్లను గురువారం తహసీల్దార్ లక్ష్మీనారాయణ పంపిణీ చేసి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు మంచి పౌష్టికాహారం అందిస్తున్నారని వీటిని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి మాట్లాడుతూ మండలంలోని 42 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 139 మంది గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా 10 రకాల ఆహార పదార్థాలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జూలు బకర్, ఆర్‌ఐ సురేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పోషకాహార కిట్లను అందిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ, తదితరులు

తల్లిపాలు బిడ్డలకు ఎంతో శ్రేష్టం

చెన్నూరు : తల్లిపాలు బిడ్డలకు ఎంతో శ్రేష్టమని వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్యలు తెలిపారు. గురువారం చెన్నూరులోని మైనార్టీ కాలనీ రెండో వార్డు, పదవ వార్డులలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల కార్యక్రమంలో వారు పాల్గొని గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లు, ముదిరెడ్డి గీతా, సాదక్ అలీ, కో ఆప్షన్ నెంబర్, వారిష్, సచివాలయ కన్వీనర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని కనంపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో కొత్తపల్లె సర్పంచ్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ వేణుయాదవ్‌లు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గురువారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను కాపీ కొట్టేది చంద్రబాబే

చక్రాయపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కాపీ కొడుతున్న చంద్రబాబు పులివెందుల అభివద్ధిపైన నోరు పారేసు కోవడం తగదని చక్రాయపేట జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పర్యటనలో చంద్రబాబు ఎంపీ అవినాష్ రెడ్డిపై అసత్యమైన ఆరోపణలు చేశాడన్నారు. 40 సంవత్సరాల అనుభవం అనే నీవు నీ కుప్పం నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌గా చేసుకోలేని అసమర్థుడివని మండిపడ్డారు.